సాక్షి తిరుపతి

గురువారం । 5 । జనవరి । 2023



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.57,860
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,168
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.71,500
రిటైల్ వెండి గ్రాము రూ.73.50

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	29	20
చిత్తూరు	29	18
తిరుమల	24	16
గూడూరు	30	22
నగరి	31	21



ముక్కంటి హుండీకి రూ.1.98 కోట్లు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి హుండీని బుధవారం లెక్కించగా రూ.1,98,43,982 ఆదాయం వచ్చినట్లు ఈఓ సాగర్‌బాబు తెలిపారు.

■ ప్రజలు కష్టాల పాలైనా ప్రభుత్వంపై బురద చల్లాలి.. ఎన్ని ప్రాణాలు పోయినా పంతం నెగ్గించుకోవాలి.. ఇదే లక్ష్యంతో కుట్ర రాజకీయాలకు తెరతీస్తున్న ప్రతిపక్ష నేత చంద్రబాబు వైఖరిని చూసి కుప్పంవాసులు నివ్వెరపోతున్నారు. 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఘనుడికి సభలు, రోడ్‌షోలకు అనుమతి తీసుకోవాలని కూడా తెలియదా..? 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే అనుభవజ్ఞుడికి పోలీసు నిబంధనలపై కనీసం అవగాహన లేదా..? ఈ పెద్దమనిషినా మనం ఇన్నేళ్లపాటు మోసింది.. అని నియోజకవర్గ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.ప్రశాంతంగా బతకనీయకుండా ఇదేం రు'బాబు' అంటూ మండిపడుతున్నారు.

ఇదేం రుబాబు!

- చంద్రబాబు పర్యటనపై కుప్పం వాసుల కలవరం
- కిరాయి మూకల అల్లర్లపై భయం


పోలీసులపై విరుచుకుపడుతున్న బాబు

సాక్షి, చిత్తూరు/కుప్పం/శాంతిపురం : జనం ఊహించినట్టుగానే చంద్రబాబు కుప్పం మూడురోజుల పర్యటనలో తొలిరోజు టీడీపీ నాయకులు ఉద్రిక్త వాతావరణం సృష్టించడంపై అంతా మండిపడుతున్నారు. తాము ఎప్పుడూ స్థానికంగా చూడని వ్యక్తులు మంగళవారం ఉదయం పసుపు కండువాలు ధరించి ప్రత్యక్షం కావడంతోనే మళ్లీ అరాచకాలు సృష్టిస్తారని సామాన్య జనం భయాందోళనకు గురయ్యారు. ఆ ప్రకారమే ఉదయం 10 గంటల నుంచి చంద్రబాబు వచ్చే 4 గంటల వరకు తెలుగుతమ్ముళ్ళు ఎక్కడికక్కడ వీరంగం చేస్తూ కనిపించారు. కందుకూరు, గుంటూరు ఘటనలు పునరావృతం కాకూడదని జాగ్రత్తలు తీసుకుంటున్న పోలీసులపైనే టీడీపీ కార్యకర్తలు దాడికి దిగడం, పిడి గద్దులు గుద్ది నెట్టి పడేయడం చూసి జనం వణికిపోయారు. ఇదేం ఖర్మ అంటూ చంద్రబాబుపై దుమ్మెత్తిపోస్తున్నారు.

అర్ధరాత్రి వరకు పర్యటన

చంద్రబాబు మొదటిరోజు పర్యటన బుధవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. నిర్ణీత సమయం కంటే ఆరు గంటలు ఆలస్యమైంది. రాత్రి 11 గంటల వరకు 121 పెద్దూరు వీధుల్లో పర్యటించారు. అక్కడి నుంచి కుప్పం చేరుకున్నారు.


వీరంగం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు



కర్రతో కార్యకర్త, బారికేడ్లు ధ్వంసం చేస్తున్న టీడీపీ శ్రేణులు

నేడు జిల్లాలో గవర్నర్ పర్యటన

తిరుపతి అర్బన్/ రేణిగుంట : గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ గురువారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు గవర్నర్ రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారన్నారు. అనంతరం బాలాజీ వైద్య కళాశాల, రీసెర్చ్ సెంటర్‌లో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం క్లాసులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలలో డిజిటల్ లైబ్రరీ భవనానికి శంకుస్థాపన చేస్తారని వివరించారు. అనంతరం తిరుమలకు చేరుకుంటారు.

సంక్షేమం.. పేదరికమే ప్రామాణికం

- కరోనాతో తగ్గిన ఆదాయం
- ఆగని పథకాలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సోమల(పుంగనూరు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదరికమే కొలమానంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడం జరుగుతోందని రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం సోమల మండలంలో పల్లెబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నంజంపేటలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అక్కడ జరిగిన సభలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే కరోనా మహమ్మారి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ఆ సమయంలో రాష్ట్ర ఆదాయం పూర్తిగా తగ్గిందన్నారు. కానీ ప్రజలకు ఇచ్చిన మాట మేరకు క్యాలెండర్ ప్రకారం సంక్షేమ పథకాలను అందించామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేద రోగులకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని చెప్పారు. అలాగే నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలుగా అభివృద్ధి చేశామన్నారు. పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్, మెనూ ప్రకారం భోజనంతోపాటు ప్రపంచంలో ఎవరితోనైనా తలపడేలా పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారని చెప్పారు. కార్ల్‌మార్క్స్ చెప్పినట్లు పేదకుటుంబాలు అభివృద్ధి చెందాలంటే విద్య అవసరమన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో 98 శాతం హామీలను నేరవేర్చి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రికార్డు సృష్టించారని మంత్రి తెలిపారు. చంద్రబాబు ఎన్నికల హామీలను ఒకటి కూడ అమలు చేయకుండా మహిళలు, రైతులను మోసగించారని ఎద్దేవా చేశారు. మన కుటుంబాన్ని ఆదుకునే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి, ఆయనకు అందరూ ఆశీర్వాదాలు అందించాలని కోరారు.


నూతన పెన్షన్లు పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తాగు, సాగునీటికి ప్రాజెక్టుల ఏర్పాటు

ప్రజలకు తాగు, సాగునీరు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పట్టుదలతో ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. తంబళ్లపల్లె, పుంగనూరు, సోమల మండలాల్లో రిజర్వాయర్ల నిర్మాణం చురుగ్గా సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం గండికోట నుంచి పైపులైన్ల ద్వారా పుంగనూరుకు నీటిని తరలించే కార్యక్రమం త్వరలోనే పూర్తి అవుతుందని చెప్పారు. అలాగే హంద్రీనీవా కాలువను విస్తరించి, అన్ని చెరువులకు నీటిని తరలించి, రైతులు, ప్రజలకు తాగు, సాగునీటి సమస్య లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అందరు సంతోషంగా ఉన్నారని చెప్పారు. మండలంలోని ఆవులపల్లె రిజర్వాయర్ పనులు కొనసాగుతున్నాయని, వచ్చే వర్షాకాలం నాటికి పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పనులు పూర్తయితే మండంలోని అన్ని చెరువులకు సాగునీరు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంపీపీ ఈశ్వరయ్య, బోయకొండ ఆలయ చైర్మన్ మిద్దింటి శంకరనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంగాధర రాయల్, సంయుక్త కార్యదర్శి ఆకుల గజేంద్ర, అమాస మోహన్, నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్ బాషా, నాయకులు నాగభూషణంరెడ్డి, ఝాన్సీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

6న గుడిమల్లం టూర్

తిరుపతి అలిపిరి : గుడిమల్లం పరశురామే శ్వరస్వామి ఆలయ సందర్శనకు శుక్రవారం ప్రత్యేక ప్యాకేజీతో బస్సులు నడపనున్నట్లు టూరిజం డీఎం గిరిధర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం నుంచి ఒక్కరోజు టూర్ కోసం ఉదయం 7 గంటలకు బస్సులు బయలుదేరుతాయన్నారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్యాకేజీ రూపొందించామని, ఆసక్తిగల వారు రూ.175 చెల్లించి టూర్‌కు రావచ్చని వెల్లడించారు. వివరాలకు 0877–2289123, 9848007033 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కొత్తగా మురిపించేన్



శ్రీకాళహస్తిలో జరిగిన పెన్షన్ వారోత్సవాల్లో వృద్ధులకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయంలో పింఛన్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ఏ ఆదరణలేని ఆపన్నులకు ఆసరాగా నిలుస్తోంది సర్కారు.. ఎన్నికల హామీ మేరకు ఏటా పింఛన్ మొత్తం పెంపుతో పాటు అర్హత ఉన్న కొత్త వారికి పింఛన్లు మంజూరు చేస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి రూ.250 పెంచడంతో పాటు మరెందరో అభాగ్యులను ఆదు కుంది. ఈ క్రమంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో లబ్ధిదారులు వారో త్సవాలు జరుపుకుని కేక్ కటింగ్‌లు, సీఎం చిత్రపటాలకు పాలాభిషేకాలు చేసి సంబరాలు జరుపుకుంటున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



శాంతిపురం మండలం అబకలదొడ్డి గ్రామంలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్సీ భరత్



బంగారుపాళెంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



రాపూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి



చంద్రగిరిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు, పక్కన ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



కోట మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



వరదయ్యపాళెంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



తిరుపతి 27వ డివిజన్‌లో పింఛన్‌ను అందజేస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ శిరీష

రుయాకు ప్రాణ రక్షణ పరికరాలు



పరికరాలను పరిశీలిస్తున్న వైద్యులు

తిరుపతి తుడా : రుయా చిన్నపిల్లల వార్డుకు తిరుపతి రోటర్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.11లక్షల విలువైన ప్రాణ రక్షణ పరికరాలను వితరణ చేశారు. బుధవారం ఈ మేరకు చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ కిరీటికి అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు కేవీ చలపతి మాట్లాడుతూ నవజాతి శిశువులకు అత్యవసర పరిస్థితుల్లో వినియోగించే నాస్ ఇన్వేసిస్ వెంటిలేషన్ అండ్ అర్టిరియల్ బ్లడ్ గ్యాస్ ఎనలైజర్స్ అందించామన్నారు. ప్రధాన దాత ప్రకాష్‌చౌదరి, సుమిత్‌శారీస్ ప్రతినిధి సరిత సహకారంతో పరికరాలను కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ రాజకుమార్, ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ జయరామ్ ప్రసాద్, ట్రెజరర్ రాజరేష్, సభ్యులు హేమచందర్, దామోదరం, డాక్టర్ మురళి, ప్రొఫెసర్ సుధాకర్, రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

పెన్షనర్లకు బయోమెట్రిక్ నమోదు

తిరుపతి అర్బన్ : జిల్లాలోని 23,450 మంది పెన్షనర్లకు బయోమెట్రిక్ నమోదు చేస్తున్నట్లు జిల్లా ఖజానా, లెక్కల అధికారి లక్ష్మీకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఏటా జనవరి, ఫిబ్రవరిలో బయోమెట్రిక్ నమోదు చేస్తున్నామని, ఈ అవకాశాన్ని పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీవన్‌ప్రమాణ్ కింద పెన్షనర్లకు ఇస్తున్న డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ ప్రయోజనకరమని పేర్కొన్నారు.

9న అప్రెంటిస్‌షిప్ మేళా

తిరుపతి ఎడ్యుకేషన్ : పద్మావతిపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వి.శ్రీలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ స్కిల్ ఇండియా, మేకిన్ ఇండియాలో భాగంగా చేపట్టనున్న మేళాలో వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అర్హులైన అభ్యర్థులకు అప్రెంటిస్‌షిప్ అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు అప్రెంటిస్‌షిప్ సలహాదారు ఎం.సెల్వరాజ్‌ను 92937 41997, 99595 53093 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గిల్టు నగలతో మోసం

చిల్లకూరు : కుదువ పెట్టుకున్న బంగారు నగలు గిల్టువని తెలియడంతో పాన్ బ్రోకర్ యజమాని పోలీసులను ఆశ్రయించాడు. వివరాలు.. మండలంలోని తిక్కవరంలో రాజస్థాన్‌కు చెందిన మదన్ అనే వ్యక్తి గణేష్ పాన్ బ్రోకర్ పేరుతో కుదువ వ్యాపారం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో గత నెల నెల్లూరుకు చెందిన మహేష్, హరిబాబు ఓ నగను రూ.50వేలకు కుదువ పెట్టారు. మళ్లీ ఈ నెల 2వ తేదీన మరో ఆభరణాన్ని రూ.50వేలకు తనఖా పెట్టారు. దుకాణ యజమాని సదరు నగలను తనిఖీ చేయించగా అవి గిల్టు నగలుగా తెలిసింది. దీనిపై బాధితుడు మదన్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమల ఘాట్‌లో ప్రమాదం



గోడను ఢీకొన్న వ్యాన్

తిరుమల : మొదటి ఘాట్‌రోడ్‌లో బుధవారం జరిగిన ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. వివరాలు.. కర్ణాటకలోని బళ్లారికి చెందిన వి.యువరాజ్ తన కుటుంబీకులతో కలిసి వ్యాన్‌లో తిరుమలకు వచ్చాడు. శ్రీవారిని దర్శించుకుని తిరుగుప్రయాణంలో ఉండగా 55వ మలుపు వద్ద వ్యాన్ అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొంది. ఈప్రమాదంలో గాయపడిన వ్యక్తిని అశ్విని ఆస్పత్రికి తరలించారు. తిరుమల ట్రాఫిక్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గూడూరురూరల్ : మండలంలోని కొండాగుంట గ్రామానికి చెందిన రమణయ్య అనే వ్యక్తి కుటుంబ కలహాల కారణంగా బుధవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. తెలుగు గంగ కాలువ వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్న రమణయ్యను స్థానికులు గూడూరుఏరియా ఆసుపత్రికి తరలించారు.

రైలు కింద యువకుడు పడి మృతి

తిరుపతి క్రైమ్ : తిరుపతి– రేణిగుంట మధ్య మార్గంలోని కాటన్ మిల్ వద్ద బుధవారం రైలు కింద గుర్తుతెలియని యువకుడు పడి మృతి చెందాడు. లోకో పైలెట్ ద్వారా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడికి 25 నుంచి 30 ఏళ్ల వయసు ఉంటుందని, మెడలో రుద్రాక్షమాల ధరించాడని, దేహంపై గ్రీన్ కలర్ షర్ట్ ఉందని వివరించారు. మృతుడి వివరాలు తెలిసివారు 9440627638 నంబర్‌కు సమాచాం అందించాలని కోరారు.

నిజం చెప్పడమే జర్నలిజం

- విలువలు పాటించకుంటే అనర్థం
- అసత్య కథనాలపై ఆత్మవిమర్శ అవసరం
- ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని



మీట్ ద ప్రెస్‌లో మాట్లాడుతున్న కొమ్మినేని శ్రీనివాసరావు

తిరుపతి కల్చరల్ : విలువలు పాటిస్తూ వాస్తవాలను చెప్పడమే జర్నలిజమని ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన మీట్ ద ప్రెస్ నిర్వహించారు. కొమ్మినేని మాట్లాడుతూ పత్రికలు ప్రచురించే ప్రతి కథనం ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. సంస్థ యాజమాన్యం ఏకపక్షంగా ఉన్నా, జర్నలిస్టులు వృత్తిధర్మం మరవకూడదన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దాలుగా తాను జర్నలిజంలో ఉన్నానని, క్షేత్రస్థాయి సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉందని స్పష్టం చేశారు. కొన్ని పత్రికలు ప్రభుత్వం మంచి చేస్తున్నా బురదజల్లడం మంచికాదన్నారు. పనిగట్టుకుని విషపూరితంగా కథనాలను ప్రచురించడం సమాజానికి శ్రేయస్కరం కాదని చెప్పారు. తప్పుడు కథనాలపై ఎవరికి వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. త్వరలో కళాశాలలు, వర్సిటీల్లో అవగాహన సదస్సులు నిర్వహించి జర్నలిస్టుల నైపుణ్యాలను మరింత మెరుగు పరిచేందుకు తోడ్పడతామని తెలిపారు. ఈసందర్భంగా తిరుపతి ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జె.భాస్కర్‌రెడ్డి, పి.బాలచంద్ర, వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. జర్నలిస్టుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. తిరు పతి ప్రెస్‌క్లబ్ తెలిపిన ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఐపీఆర్‌ఓ బాలకొండయ్య, డీపీఆర్‌ఓ విజయసింహారెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు ‘రోప్ వే’



ప్రకాష్‌గౌర్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు రోప్ వే ఏర్పాటు చేయాలని ఎంపీ మద్దిల గురుమూర్తి కోరారు. బుధవారం న్యూఢిల్లీలో నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ సీఈఓ ప్రకాష్‌గౌర్‌కు విన్నవించారు. పర్వతమాల పరియోజన కింద తిరుపతిలో రోప్ వే ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలని ఆదేశించినట్లు తెలిసిందన్నారు. ఈ విషయం సీఈఓ దృష్టికి తీసుకెళ్లగా తిరుపతిలో 4 కిలోమీటర్ల మేర రోప్ వే ఏర్పాటుకు త్వరలోనే అధ్యయనం చేయనున్నట్లు వెల్లడించారని ఎంపీ తెలిపారు.

పీఎంఈజీపీ పథకంపై అవగాహన



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ కోటిరెడ్డి

తిరుపతి రూరల్ : నగరంలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో బుధవారం ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ)పై అవగాహన సదస్సు నిర్వహించారు. స్టేట్ నోడల్ ఆఫీసర్ కోటిరెడ్డి మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. పీఎంఈజీపీ, ముద్ర తదితర పథకాల ద్వారా వ్యాపారాభివృద్ధికి రూ.కోటి వరకు బ్యాంకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. సేవా రంగ కార్యకలాపాలకు రూ.25 లక్షల వరక లోన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ప్రాజెక్టు వ్యయంలో 15శాతం వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఈ పథకం కింద లబ్ధిపొందేందుకు అర్హులే అని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ప్రతాప్ , డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, ఎల్‌డీఎం సుభాష్, డీపీఎం పట్టాభిరెడ్డి పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో కోవిడ్ టెస్ట్ సెంటర్ తనిఖీ



కోవిడ్ పరీక్ష కేంద్రంలో రిపోర్టు పరిశీలిస్తున్న మంత్రి విడదల రజని

రేణిగుంట : విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన కోవిడ్ టెస్ట్ సెంటర్‌ను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని బుధవారం రాత్రి తనిఖీ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు తప్పనిసరిగా కోవిడ్ పరీక్షలు నిర్వహించి సత్వరమే రిపోర్టులు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ శ్రీహరి, మండల వైద్యాధికారి డాక్టర్ ఛత్రప్రకాష్‌రెడ్డి, రుయా అభివృద్ధి కమిటీ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్‌రాయల్ పాల్గొన్నారు.

ఉప్పొంగిన యువజనోత్సాహం



విద్యార్థిని నృత్యభంగిమ



విద్యార్థుల వాయిద్య సంగీత ప్రదర్శన

తిరుచానూరు : శ్రీపద్మావతి మహిళా కళాశాలలో బుధవారం సౌత్‌జోన్ యూత్ ఫెస్టివల్‌లో భాగంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. వర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియం, ఓపెన్ ఆడిటోరియం, ధృతి ఆడిటోరియం, సావేరి సెమినార్ హాల్, ఎంబీబీ ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం నుంచి రాత్రి వరకు విద్యార్థులు శాస్త్రీయ, జానపద నృత్యాభినయాలు ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతలు ఐదు వేదికల్లో జరిగిన ప్రదర్శనలను పర్యవేక్షించారు కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ సహాయ కార్యదర్శి డాక్టర్ బల్జిత్ సింగ్, మహిళా వర్సిటీ వీసీ దువ్వూరి జమున, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డీఎం మమత పాల్గొన్నారు.